సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం : 6 : మే : 2025



ప్రజాసమస్యలు పరిష్కరించాలి
ప్రజా సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. 8లో



ఇల్లెందు నుంచి కొత్త సర్వీసులు..
ఇల్లెందు నుంచి మణుగూరు, సత్తుపల్లి ప్రాంతాలకు నడిచే రెండు కొత్త బస్సులను సోమవారం ప్రారంభించారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
40° / 27°
జిల్లాలో మంగళవారం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగడంతో పాటు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రేపు పొంగులేటి పర్యటన

దుమ్ముగూడెం : మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హాజరు కానున్నారని తెలిసింది. చిన్నబండిరేవులో ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, ఎంపీడీఓ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పత్రాల పంపిణీ, సింగవరం – ఎస్ లక్ష్మీపురం గ్రామాల మధ్య పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనుల శంకుస్థాపన, కె దంతెనం పంచాయతీలో గ్రామ పంచాయతీ కార్యాలయానికి ప్రారంభోత్సవం చేస్తారని సమాచారం. అయితే మంత్రి పర్యటనపై ఇప్పటివరకు అధికారికంగా ప్రకటన వెలువడలేదు.

జూన్ 9 నుంచి లోక్ అదాలత్

జిల్లా జడ్జి పాటిల్ వసంత్ వెల్లడి



ప్రియదర్శిని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాటిల్ వసంత్ తదితరులు

కొత్తగూడెంటౌన్: జూన్ 9 నుంచి 14 వరకు జరిగే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ఒక ప్రకటనలో సూచించారు. ఈ క్రమంలో సోమవారం నుంచి ఈనెల 19 వరకు అన్ని కోర్టుల్లో ముందస్తు లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, ఇతరులు వేసిన చెక్‌బౌన్స్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

ప్రియదర్శిని మరణం తీరని లోటు


తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఎంజీ ప్రియదర్శిని మరణం తీరని లోటని జిల్లా జడ్జి పాటిల్ వసంత్ అన్నారు. జిల్లా కోర్టులో సోమవారం నిర్వహించిన సంతాపసభలో ఆయన మాట్లాడారు. 2008లో జిల్లా జడ్జిగా సేవలు ప్రారంభించి, పలు జిల్లాల్లో విధులు నిర్వహించారని తెలిపారు. 2022లో హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారని, న్యాయ వ్యవస్థకు ఆమె వినూత్న సేవలు అందించారని కొనియాడారు. అంతకుముందు ప్రియదర్శిని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు జడ్జి ఎస్.సరిత, సీనియర్ సివిల్ జడ్జి కె.కిరణ్‌కుమార్, అదనపు సివిల్ జడ్జి కె.కవిత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్, కొత్తగూడెం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు, జూనియర్ సివిల్ జడ్జీలు సుచరిత, కె.సాయిశ్రీ, బి.రవికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు జె.గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శి భాగం మాధవరావు, సహాయ కార్యదర్శి కాసాని రమేష్, కోశాధికారి కె.చిన్నికృష్ణ, మహిళా కార్యదర్శి ఆడపాల పార్వతి, క్రీడల కార్యదర్శి ఉప్పు అరుణ్, గ్రంథాలయ కార్యదర్శి మాలోతు ప్రసాద్ పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ మహేందర్ అన్నారు. భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగులు ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తుంటారని, ఈ క్రమంలో తగిన జాగ్రత్తలు అవసరమని సూచించారు. ఐఎస్‌ఐ ప్రమాణాలు గల రక్షణ పరికరాలనే వినియోగించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఈ నందయ్య, ఏడీఈ హుస్సేన్, ఏఈలు మధు, ప్రతాప్, నరేష్, రవీందర్ పాల్గొన్నారు.

పొలం గట్ల వెంట పెరిగిన తాటి చెట్లు





లెక్కలు కాదు.. మొక్కలు

గతంలో శాఖల వారీగా హరితహారం లక్ష్యాలు
- ఈసారి ఒక్కో శాఖకు ఒక్కో రకం మొక్కల కేటాయింపు
- తాటి, సుబాబుల్, వెదురు వంటి వాటికి ప్రాధాన్యత
- వినూత్న రీతిలో ప్రయత్నిస్తున్న కలెక్టర్ పాటిల్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణలో అడవులు, పచ్చదనం పెంచేందుకు గత పదేళ్లుగా హరిత హారం, వన మహోత్సవం పేరుతో ప్రత్యేకంగా మొక్కలు నాటుతున్నారు. ప్రారంభంలో ఈ కార్యక్రమం ప్రణాళియుతంగా సాగినా.. ఆ తర్వాత మొక్కుబడిగా మిగిలిపోయిందనే విమర్శలు వచ్చాయి. అయితే పదేళ్ల తర్వాత ఈ కార్యక్రమాన్ని సరికొత్త పంథాలో తీసుకెళ్లేందుకు కలెక్టర్ జితేశ్ పాటిల్ ప్రయత్నాలు మొదలెట్టారు.

శాఖల వారీగా..

ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో 70 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించిన కలెక్టర్.. ఈ మేరకు శాఖల వారీగా ఎన్ని మొక్కలు నాటాలనే అంశంపై కూడా స్పష్టత ఇచ్చారు. అత్యధికంగా గ్రామీణాభివృద్ధి శాఖకు 30 లక్షల మొక్కలు లక్ష్యంగా నిర్దేశించగా తెలంగాణ అటవీ అభివృద్ధి శాఖకు 12 లక్షలు, సింగరేణికి 10 లక్షలు, అటవీ శాఖకు 10 లక్షల చొప్పున కేటాయించారు. ఇంకా ఇతర విభాగాలకు కూడా లక్ష్యాలను నిర్ణయించారు. గత పదేళ్లుగా ఇదే తరహాలో మొక్కలు పెంపకంపై ప్రణాళికలు ఘనంగా కనిపించినా వాటి తాలూకు ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో అంతగా కనిపించడం లేదు. నాటిన మొక్కలను కాపాడలేకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. అయితే ఈ పరిస్థితిలో మార్పు తెచ్చి జవాబుదారీతనం పెంచే ప్రయత్నం ఈసారి జరుగుతోంది.

వెదురు యాక్షన్ ప్లాన్..

రాష్ట్రంలో అడవులు ఎక్కువగా విస్తరించిన జిల్లాగా భద్రాద్రికి గుర్తింపు ఉంది. కానీ ఇక్కడ ఆశించిన స్థాయిలో వెదురు వనాలు లేవు. వెదురుతో ఫర్నిచర్ తయారు చేసే నైపుణ్యం గలవారు జిల్లాలో ఉన్నా ముడి వెదురు ఆశించిన స్థాయిలో లభించడం లేదు. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు వీలుగా వెదురు మొక్కలు నాటే కార్యక్రమాన్ని అటవీ శాఖకే కేటాయించారు. దీంతో అడవి చిక్కబడటంతో పాటు వృత్తి నైపుణ్యం గల వారికి ఉపాధి లభిస్తుంది. అంతేకాక.. జిల్లాలో చేపట్టాలని ఆశిస్తున్న సమ్మిళిత సాగుకు వెదురు వనాల పెంపకం తోడ్పాటును అందించనుంది. ఇదే తరహాలో సాగునీటి కాల్వల వెంట వట్టివేర్లు, సుబాబుల్ వంటి మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఈ ప్రయోగం ఆశించిన ఫలితాలు ఇస్తే ఇతర జిల్లాలకు భద్రాద్రి ఆదర్శంగా నిలిచే అవకాశముంది.

మరింత ప్రణాళికాయుతంగా..

హరితహారం కార్యక్రమం మొదలైనప్పటి నుంచి ప్రధానంగా వాసి కంటే రాశి మీదనే దృష్టి కేంద్రీకృతమైంది. గతంలో పాఠశాల్లలో కానుగ, వేప వంటి నీడ నిచ్చే చెట్లనే ఎక్కువగా నాటేవారు. ఆ తర్వాత వీటిని పట్టించుకునే అంశంపై అంతగా శ్రద్ధ పెట్టేవారు కాదు. కానీ గతేడాది ఈ విధానంలో మార్పులు తీసుకొచ్చి, ఆయా ప్రదేశాల్లో పరిస్థితులు, అక్కడి ప్రయోజనాల ఆధారంగా మొక్కలు నాటడంపై దృష్టి పెట్టారు. అందులో భాగంగా స్కూళ్లలో మునగ, తులసి, కలబంద, ఉసిరి, కరివేపాకు వంటి చెట్లను నాటారు. గతంలో పోల్చితే ఈ ప్రయోగం పాఠశాలల్లో విజయవంతమైంది. అనేక స్కూళ్లలో గతేడాది నాటిన చెట్లు బతికి ఉండటంతో పాటు తమవంతు ప్రయోజనాలు అందిస్తున్నాయి. దీంతో ఈసారి వన మహోత్సవంలో మరింత ప్రణాళికాయుతంగా ఈ పని చేయబోతున్నారు. ఎక్సైజ్ శాఖ తాటి, ఈత చెట్లు, ఇరిగేషన్ శాఖ సుబాబుల్, వట్టి వేర్లు, అటవీశాఖ వెదురు, విద్యాశాఖ ఔషధ మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రైతులను సైతం భాగస్వాములను చేసేందుకు ఎర్ర చందనం, టేకు, వెదురు మొక్కలను కూడా అందుబాటులో ఉంచుతున్నారు.

రైతుల సంక్షేమానికే 'భూ భారతి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని, పక్కన కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు

- రెవెన్యూ సదస్సుల ప్రారంభంలో కలెక్టర్
- పైలట్ ప్రాజెక్ట్‌గా సుజాతనగర్ మండలం

సుజాతనగర్ : రైతుల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సుజాతనగర్ మండలాన్ని పైలట్‌ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయగా.. గరీబ్‌పేట, బేతంపూడి గ్రామాల్లో సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూ వివాదాల పరిష్కారానికి ఈ చట్టం దోహదం చేస్తుందన్నారు. రైతులకు వారి భూములపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం కొత్త అంశాలను పొందుపరుస్తూ నూతన ఆర్ఓఆర్ తెచ్చిందని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, ప్రతీ దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 15 వరకు సదస్సులు నిర్వహించి, రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధు, తహసీల్దార్ శిరీష, ఆర్‌ఐ వీరభద్రం, కాంతారావు పాల్గొన్నారు.

పంటల మార్పిడితో అధిక లాభాలు..

సూపర్‌బజార్(కొత్తగూడెం): పంటల మార్పిడి పద్ధతి అనుసరిస్తే అధిక లాభాలు గడించొచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. రాబోయే వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలం పెనగడపలో సోమవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13 వరకు సదస్సులు కొనసాగుతాయన్నారు. పంటల సాగులో యూరియా వాడకాన్ని తగ్గించాలని, అవసరమైన మేరకే రసాయనిక ఎరువులు వాడుకుని ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల వైపు కూడా రైతులు ఆసక్తి చూపాలని అన్నారు. కేవీకే శాస్త్రవేత్తల సేవలను ఉపయోగించుకోవాలని, సాగులో శాస్త్రీయత పెంపొందించుకుని అధిక లాభాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, ఉద్యాన శాస్త్రవేత్త బి.శివ, కొత్తగూడెం ఏడీఏ నరసింహారావు, చుంచుపల్లి ఏఓ రాజేశ్వరి, ఏఈఓ మమత పాల్గొన్నారు.

మండుటెండల్లోనూ పచ్చందాలు



అశ్వారావుపేట మండలం వినాయకపురం – నారాయణపురం రహదారిలో ఐదేళ్ల క్రితం అటవీ శాఖ ఆధ్వర్యంలో వందల సంఖ్యలో మొక్కలు నాటారు. అవి చెట్లుగా ఎదిగి ఇప్పుడు కనువిందు చేస్తున్నాయి. మండుటెండల్లోనూ పచ్చని అందాలతో హరితవనంగా కనిపించడంతో పాటు ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారికి ఉపశమనం కలిగిస్తున్నాయి.
– అశ్వారావుపేటరూరల్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



గిరిజన దర్బార్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: గిరిజన దర్బార్‌లో దరఖాస్తు చేసుకున్న అర్హులైన గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ యూనిట్ అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తమ పరిధిలో ఉన్నవాటిని వెంటనే పరిష్కరిస్తామని, మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపిస్తామని తెలిపారు. గిరిజనులు సమర్పించిన అర్జీల్లో పోడు భూములకు పట్టాలు, భూ సమస్యలు, వ్యక్తిగత రుణాలు, వ్యవసాయ భూములకు కరెంటు మోటార్ల వంటి సమస్యలపైనే ఎక్కువగా ఉన్నాయని వివరించారు.

ఉత్పత్తులకు గుర్తింపు తెచ్చుకోవాలి..

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను గిరిజన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని, కుటీర పరిశ్రమ నెలకొల్పి తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్‌లో గుర్తింపు తెచ్చుకోవాలని పీఓ రాహుల్ అన్నారు. దుమ్ముగూడెం మండలం అంజుబాక గ్రామానికి చెందిన శ్రీ ముత్యాలమ్మ యాష్ బ్రిక్స్ యూనిట్ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్న తరహా పరిశ్రమ నెలకొల్పి జీవనోపాధి పెంచుకోవడం అభినందనీయమని అన్నారు. ఇటుకల తయారీ, మార్కెటింగ్ సౌకర్యంపై యూనిట్ సభ్యులను ఆరా తీశారు. ఇటుకలు తయారీకి అవసరమైన ముడి సరుకులను సరసమైన ధరలకు కొనుగోలు చేసి, మన్నికైన ఇటుకలు తయారు చేయాలని సూచించారు.

పాఠశాలలో మరమ్మతులు పూర్తి చేయాలి..

గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో అవసరమైన మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయాలని పీఓ రాహుల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలతో పాటు గ్రంథాలయంలో జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలో డైనింగ్ హాల్, గ్రంథాలయంలో పాఠకులకు రీడింగ్ రూమ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, అధికారులు రవీంద్రనాథ్, చంద్రశేఖర్, అరుణకుమారి, రాంబాబు, ఉదయభాస్కర్, ఉదయ్‌కుమార్, వేణు, ఆర్. లక్ష్మీనారాయణ, అశోక్ కుమార్, హరీష్, శ్రీనివాస్, జేడీఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు సాగునీటి సదుపాయం

రెడ్కో మేనేజర్ అజయ్‌కుమార్

చండ్రుగొండ : గిరిజనుల పోడు భూములకు సాగునీటి సదుపాయం కల్పిస్తామని, ఇందుకోసం చండ్రుగొండ మండలంలోని బెండాలపాడు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశామని రాష్ట్ర ఇంధన వనరుల పునరుద్ధరణీయ సంస్థ (రెడ్కో) ఉమ్మడి జిల్లా మేనేజర్ అజయ్‌కుమార్ తెలిపారు. ఇందిర జల వికాసం పథకం ద్వారా పట్టాలు పొందిన వారి పోడు భూముల్లో వేయనున్న బోరుబావులకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒక్కో బోరుకు సోలార్ ప్లాంట్‌తోపాటు ఐటీడీఏ ద్వారా రూ. 5 లక్షలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భోజ్యానాయక్, బొర్రా సురేష్, ఫజల్ పాల్గొన్నారు.

శిక్షణ కోసం భోపాల్‌కు డీఎఫ్‌ఓ

చుంచుపల్లి: జిల్లా అటవీ శాఖ అధికారి కిష్టా గౌడ్ శాఖా పరమైన శిక్షణ కోసం సోమవారం భోపాల్ వెళ్లారు. ఆయన దాదాపు మూడు వారాల పాటు శిక్షణలో ఉంటారు. దీంతో జిల్లా ఇన్‌చార్జ్ డీఎఫ్‌ఓగా ఖమ్మం జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి.. సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

దరఖాస్తులలో కొన్ని..

- ఒంటరి మహిళనైన తనకు ఏ ఆధారం లేదని, రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రుణం మంజూరు చేయాలని పాతపాల్వంచ శ్రీనివాసపురం కాలనీకి చెందిన ఎండీ షాకీరా బేగం దరఖాస్తు చేయగా, మైనార్టీ సంక్షేమాధికారికి ఎండార్స్ చేశారు.
- తమకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టా గల 4.20 ఎకరాల భూమి ఉందని, ఇప్పటివరకు రైతుభరోసా, రుణమాఫీ మంజూరు కాలేదని పినపాక మండలం ఎల్లాపురానికి చెందిన చర్ప చినలక్ష్మి దరఖాస్తు చేయగా జిల్లా వ్యవసాయాధికారికి పంపించారు.
- తాను 20 ఏళ్లుగా అద్దె ఇంటో ఉంటున్నానని, దివ్యాంగుడినైన తనకు అద్దె చెల్లించడం భారం అవుతోందని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని భద్రాచలం సుభాష్‌నగర్‌కు చెందిన గండేపల్లి రామకృష్ణ అందించిన దరఖాస్తును హౌసింగ్ పీడీకి ఎండార్స్ చేశారు.

క్రమపద్ధతిలో ఎరువులు వాడాలి



మాట్లాడుతున్న హేమంత్‌కుమార్, పక్కన అధికారులు, శాస్త్రవేత్తలు

'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో అధికారుల సూచన

అశ్వారావుపేట : అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో స్థానిక రైతు వేదికతో పాటు మండలంలోని వినాయకపురంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ.. భూసార పరీక్షలు నిర్వహించాక నిర్ణీత మోతాదుల్లోనే ఎరువులు వేయాలని రైతులకు సూచించారు. యూరియా వినియోగం తగ్గిస్తూ భూసారాన్ని కాపాడుకుని అధిక దిగుబడి సాధించాలని అన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వి.బాబూరావు మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని సూచించారు. ఏళ్లుగా ఒకే పంట కాకుండా మార్పు చేస్తే అధిక లాభాలు సాధించవచ్చని తెలిపారు. అశ్వారావుపేట పీఏసీఎస్ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు, శాస్త్రవేత్తలను ఒక దగ్గరకు చేర్చి అన్నదాతలకు విజ్ఞానం పెంచేలా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. నీటి యాజమాన్య పద్ధతుల ద్వారా లాభాల గురించి ఏడీఏ రవికుమార్ వివరించారు. వ్యవసాయంతో పాటు పశుపోషణపై దృష్టి సారించాలని ఏడీహెచ్ డాక్టర్ ప్రదీప్ అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ఐ.వి.శ్రీనివాసరెడ్డి, కె.నాగాంజలి, ఎం.రాంప్రసాద్, ఎస్.మధుసూదన్ రెడ్డి, శ్రావణ్‌కుమార్, పావని, నీలిమ, శ్రీలత, కోటేశ్వర్, కృష్ణతేజ, ఆర్.రమేష్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరం షురూ..

- 15 రోజుల పాటు విద్యార్థులకు శిక్షణ
- ఒక్కో సెంటర్ నిర్వహణకు రూ.50 వేలు



మణుగూరులో విద్యార్థులకు క్యారమ్స్ నేర్పిస్తున్న ఎంఈఓ స్వర్ణలత

మణుగూరు టౌన్: ఇప్పటివరకు హైదరాబాద్‌తో పాటు పాత జిల్లా కేంద్రాలోన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే నిర్వహించిన యంగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరాలు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించాయి. ఈ మేరకు పినపాక నియోజకవర్గంలోని మణుగూరు, అశ్వాపురం, పినపాక, బూర్గంపాడు, ఆళ్లపల్లి మండలాల్లో మొత్తం 12 ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం శిక్షణ క్యాంప్‌లు ప్రారంభమయ్యాయి. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు 15 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. కనీసం 20 మందికి పైగా హాజరయ్యే విద్యార్థుల కోసం ఒక్కో సెంటర్‌కు ప్రభుత్వం రూ.50 వేల చొప్పున కేటాయించగా శిక్షణ ఖర్చులతో పాటు విద్యార్థులకు స్నాక్స్ అందించాల్సి ఉంటుంది. విద్యార్థుల సంఖ్యను బట్టి వలంటీర్లను నియమించి శిక్షణ ఇప్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే.

ఏమేం నేర్పిస్తారంటే..?

యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్‌ల కోసం జిల్లాలో 50 పాఠశాలలను ఎంపిక చేశారు. విద్యార్థులు ప్రతిరోజూ హాజరయ్యేలా ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి 15 పని దినాల్లో ఒక్కో రోజు ఒక్కో అంశంపై శిక్షణ ఇస్తారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు జరిగే శిక్షణలో ప్రతిరోజూ మొదటి 20 నిమిషాలు ప్రాణాయామం, ఎక్సర్‌సైజులు, తర్వాత 10 నిమిషాలు విరామం, అనంతరం గంటన్నర పాటు యాక్టివిటీలు, చివరి గంట నీతి కథలు, వాటి నుంచి విద్యార్థులు అలవర్చుకోవాల్సిన మంచి లక్షణాలపై ఆడియో, వీడియో రూపంలో శిక్షణ ఇస్తారు. ప్రధానంగా చెస్, యోగా, క్యారమ్స్, సైన్స్ ప్రయోగాలు, పెయింటింగ్, చేతిరాత మెరుగు కోసం, నృత్యాలు, మార్షల్ ఆర్ట్స్, డ్రాయింగ్, కాగితాల బొమ్మలు, సాధన వంటి ఆటలపై శిక్షణతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తారు.

సమ్మర్ క్యాంపు ప్రారంభం

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం ప్రభుత్వ పాఠశాలలో యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపును ఎంపీడీఓ వరప్రసాద్, ఎంఈఓ వీరస్వామి సోమవారం ప్రారంభించారు. ఈ నెల 21 వరకు నిర్వహించనున్న ఈ క్యాంప్‌లో చదువు, ఆటలు, డ్రాయింగ్, గార్డెనింగ్ వర్క్, సీడ్ కలెక్షన్, పేపర్ క్రాఫ్ట్స్, కంప్యూటర్ స్కిల్స్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామని వారు తెలిపారు.

పిల్లలకు మానసికోల్లాసం



ప్రభుత్వం ఇలాంటి అంశాలకు శ్రీకారం చుట్టడంతో ఎప్పుడూ చదువుకునే విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుంది. వారిలో సూక్ష్మగ్రహణ శక్తి పెరుగుతుంది. చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో మార్పు వచ్చే అవకాశం ఉంటుంది. ఆటల్లో పాటించాల్సిన మెళకువలపై అవగాహన పెంచుకోవచ్చు.
–జి.నాగశ్రీ, హెచ్‌ఎం, మణుగూరు జెడ్పీ హైస్కూల్

క్లుప్తంగా

ధాన్యం కొనడంలేదని రైతుల నిరసన


రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

సుజాతనగర్: సొసైటీ ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ సోమవారం రైతులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యాన్ని ఆరబెట్టి రోజుల తరబడి ఎదురుచూస్తున్నా కొనడం లేదని ఆరోపించారు. తరలింపునకు లారీలు రావడం లేదని, ధాన్యానికి అనుగుణంగా తూర్పారబట్టే మిషన్లను ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో అద్దెకు తెచ్చుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. 40 కిలోల 500 గ్రాముల ధాన్యం తూకానికి బదులుగా 41 కిలోల 200 గ్రాముల తూకం వేయడం సరికాదన్నారు. దీనికి తోడు మరో 5 కిలోల ధాన్యం తారం తీస్తామని చెప్పడం ఏంటన్నారు. తరుగు పేరుతో మిల్లర్లు, వ్యవసాయాధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. కాగా కొనుగోళ్లను వేగవంతం చేస్తామని సివిల్ సప్లై డీటీ చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఎస్‌ఐకి రియల్ హీరోస్ అవార్డు


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న ఎస్సై ప్రవీణ్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం టాస్క్‌ఫోర్ ఎస్‌ఐ జలకం ప్రవీణ్ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా తెలంగాణ రియల్ పోలీసు హీరోస్–2025 అవార్డును అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 మందికి అవార్డులు రాగా అందులో ప్రవీణ్ కూడా ఉన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్నందుకు అవార్డు ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో ఎదురుకాళ్లతో కవలల జననం

పాల్వంచ: పాల్వంచ ప్రభుత్వాస్పత్రిలో ఎదురు కాళ్లతో కవల పిల్లలు జన్మించారు. వైద్య సిబ్బంది నార్మల్ డెలివరీ చేశారు. సోమవారం ఇంటర్నేషనల్ మిడ్ వైఫరీ దినోత్సవం రోజే క్లిష్టమైన డెలివరీ చేయడం విశేషం. మండలంలోని రేపల్లెవాడకు చెందిన గర్భిణి జూపల్లి పల్లవి రెండో కాన్పు కోసం ప్రభుత్వాస్పత్రికి రాగా వైద్యులు పరీక్షించి కవలలు పిల్లలు ఉన్నారని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సుఖ ప్రసవం కోసం కొన్ని వ్యాయామాలు చేయించి శిక్షణ ఇచ్చారు. దీంతో ఆమె వైద్య సిబ్బంది సూచనలు పాటిస్తూ వ్యాయామాలు చేసింది. సోమవారం ఆమెకు నార్మల్ డెలివరీ ద్వారా ఇద్దరు మగ పిల్లలు జన్మించారు. తల్లి, కవలలు ఆరోగ్యంగా ఉన్నారు. కాగా ఇలాంటి ప్రసవాలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.లక్షలు బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. వైద్య సేవలందించిన డాక్టర్ అనూష, సిబ్బంది సుజాత తదితరులను కలెక్టర్ జితేష్ వి.పాటిల్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంప్రసాద్ అభినందించారు.

క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గోనె సాల్మన్

పాల్వంచ: ప్రభుత్వం క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలని, దేశంలో మైనారిటీలపై జరుగుతున్న దాడులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీయూసీపీఏ రాష్ట్ర కార్యదర్శి గోనె సాల్మన్ కోరారు. సోమవారం అంబేద్కర్ కాలనీ మెర్సీ ప్రార్థన మందిరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. క్రైస్తవులు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. తొలుత పహల్గామ్ ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు. పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు జయకుమార్, బిషప్ స్టీవెన్, జాన్ విల్సన్, విజయ్‌కుమార్, సదానందం, అనిల్, దయాకర్, యేసుదాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కలప స్వాధీనం

దుమ్ముగూడెం : మండలంలోని పైడిగూడెం గ్రామ శివారులో అక్రమంగా దాచి ఉంచిన కలపను సోమవారం అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారు. రూ.1,38,688 విలువైన 11 టేకు దిమ్మలను స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు రేంజర్ కమల తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

అసలే అద్దె.. ఆపై ఇరుకు భవనాలు

- ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాల్లో ఇక్కట్లు
- భవన నిర్మాణాలకు స్థల సేకరణ సమస్య
- జిల్లాలోని ఏడు ప్రాజెక్టుల్లో అదే పరిస్థితి


అద్దె భవనంలో కొనసాగుతున్న టేకులపల్లి ప్రాజెక్ట్ కార్యాలయం

టేకులపల్లి: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాలకు సొంత భవనాల్లేక అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. అవి కూడా ఇరుకుగా ఉండటంతో సమావేశాలు నిర్వహించేందుకు, సామగ్రి భద్రపరిచేందుకు గోదాం లేక సీడీపీఓలకు ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలో మొత్తం 11 ప్రాజెక్టులు ఉండగా చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు, పాల్వంచ, టేకులపల్లి, చంద్రుగొండ, దమ్మపేట ప్రాజెక్టులకూ సొంత భవనాలు లేవు. ఈ సమస్యను గత డిసెంబర్ 11న జరిగిన రివ్యూ మీటింగ్‌లో సీడీపీఓలు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయా మండల కేంద్రాల్లో ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో భవన నిర్మాణం కోసం 600 – 1000 గజాల స్థలం గుర్తించాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు.

2016లో టేకులపల్లి ప్రాజెక్ట్ ఏర్పాటు..

టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల అంగన్‌వాడీ కేంద్రాలు గతంలో సుదిమళ్ల ప్రాజెక్టు పరిధిలో ఉండేవి. 2016లో ఆ ప్రాజెక్టు నుంచి విడదీసి పరిపాలనా సౌలభ్యం కోసం ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్ట్ ఏర్పాటు చేశారు. ప్రాజెక్ట్ గుండాలలో 60, ఆళ్లపల్లిలో 42, టేకులపల్లిలో 126 మొత్తం 228 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో 209 టీచర్లు పనిచేస్తున్నారు. 5,074 మంది చిన్నారుల, 1,098 గర్భిణులు, బాలింతలు లబ్ధిపొందుతున్నారు. 228 కేంద్రాల్లో 88 అంగన్‌వాడీలకు సొంత భవనాలు ఉన్నాయి. అద్దె భవనాల్లో 50, పాఠశాలల్లో 90 కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్ల పోస్టులు 15, హెల్పర్ పోస్టులు 19 ఖాళీగా ఉన్నాయి.

భవన నిర్మాణమెప్పుడో..?

2016 నుంచి 2025 జనవరి వరకు టేకులపల్లి సెంటర్‌లోని అద్దె భవనంలో ప్రాజెక్ట్ కార్యాలయం కొనసాగించారు. మూడు నెలల క్రితమే టేకులపల్లి పోలీసుస్టేషన్ సమీపంలోకి మార్చారు. ఇక్కడ చాలీచాలని గదుల్లో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా ప్రాజెక్టు స్థాయి, మండల స్థాయి సమావేశాలు జరుగుతుంటాయి. 228 కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఒకేసారి కూర్చునే సౌకర్యం లేదు. మీటింగ్ హాల్, టాయిలెట్స్ లేవు. అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేయాల్సిన సామగ్రి, ప్రీస్కూల్ కిట్లు, యూనిఫామ్‌లు, మెడికల్ కిట్లు భద్రపరిచే గోదాం సదుపాయం కూడా లేదు. స్థలం కోసం సీడీపీఓలు అధికారుల ద్వారా ప్రయత్నిస్తున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా, వీటిలో ఏడింటికి సొంత భవనాలు లేవు. వీటికి స్థలం గుర్తించాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. ఎమ్మెల్యేలను కలిసి స్థలం కోసం ప్రయత్నిస్తున్నాం. దాతలు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

–స్వర్ణలత లెనీనా, జిల్లా సంక్షేమ అధికారి

అద్దె భవనంలో ఇబ్బందులు



టేకులపల్లి ప్రాజెక్ట్‌కు సొంత భవనం లేదు. దీంతో అద్దె భవనంలో సమావేశాల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నాం. స్థలం కేటాయించాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి కూడా తీసుకెళ్లాం.

–కేఎం తార, టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ

ఇల్లెందు నుంచి కొత్త సర్వీసులు...

మణుగూరు, సత్తుపల్లి ప్రాంతాలకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రారంభం


కొత్త సర్వీసులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: ఇల్లెందు బస్‌డిపో నుంచి రెండు నూతన సర్వీస్‌లను ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం ప్రారంభించారు. ఇల్లెందు నుంచి మణుగూరు, సత్తుపల్లి ప్రాంతాలకు నడిపే ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ప్రత్యేక పూజలు చేసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్త సర్వీసులతో ప్రయాణికులకు ఉపయోగం ఉంటుందని అన్నారు. ఇల్లెందు, టేకులపల్లి, కొత్తగూడెం, అశ్వాపురం మీదుగా మణుగూరు సర్వీస్, కొత్తగూడెం, చంద్రుగొండ, వీఎం బంజర మీదుగా సత్తుపల్లి సర్వీసు నడుస్తుందని తెలిపారు. డిపో మేనేజర్ ఎం.దేవేందర్‌గౌడ్ మాట్లాడుతూ త్వరలో ఇల్లెందు– భూపాలపల్లి సర్వీస్ కూడా ప్రారంభిస్తామన్నారు. ఇల్లెందు డిపోకు 8 కొత్త బస్సులు వచ్చాయని తెలిపారు. ఆర్టీసీ అధికారులు సునీత, శ్రీనివాస్, రాంనర్సయ్య, వేమూరి నాగరాజు, మాజీ కౌన్సిలర్లు కొక్కు నాగేశ్వరరావు, సయ్యద్ ఆజం, నవీన్, వారా రవి, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్, బోళ్ల సూర్యం, డానియేల్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


ములకలపల్లిలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి వెంకట్

ములకలపల్లి: ప్రజా సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ములకలపల్లిలో భారీ ప్రదర్శన నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ సాగునీరు భద్రాద్రి జిల్లాకు ఇచ్చిన తరువాతే ఇతర ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ గద్దె రేవతి, డీటీ భాగ్యలక్ష్మి, ఎంఏఓ అరుణ్‌బాబులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యనారాయణ, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, పొడియం వెంకటేశ్వర్లు, గౌరి నాగేశ్వరరావు, మాలోతు రావూజా, నిమ్మల మధు, మంచాల సారయ్య గొగ్గెల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మార్క్సిజమే మానవాళి విముక్తి మార్గం

సింగరేణి(కొత్తగూడెం): మానవాళి విముక్తికి మార్క్సిజమే మార్గమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ అన్నారు. సోమవారం మంచికంటి భవన్‌లో కమ్యూనిస్ట్ పితామహుడు కార్ల్‌మార్క్స్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ సంపద సృష్టికర్తలు శ్రామికులేనని, వారి శ్రమ ద్వారా లాభాలు వస్తున్నాయని అన్నారు. అమెరికా లాంటి దేశాల్లో ఆర్థిక సంక్షోభాలకు పరిష్కార మార్గాలను మార్క్స్ రాసిన క్యాపిటల్ గ్రంథం చదివి తెలుసుకుంటున్నారని గుర్తుచేశారు.

1.11 క్వింటాళ్ల గంజాయి సీజ్

ఇల్లెందు: ఇల్లెందు–కొత్తగూడెం ప్రధాన రహదారిలో బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం పోలీసులు 1.11 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇల్లెందు డీఎస్పీ ఎస్.చంద్రభాను కథనం ప్రకారం.. పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, కొత్తగూడెం వైపు నుంచి ఓ బైక్, దాన్ని అనుసరిస్తూ మరో ఆటో వస్తున్నాయి. అనుమానంతో పోలీసులు ఆపి తనిఖీ చేయగా ఆటోలో గంజాయి లభించింది. గంజాయిని తరలిస్తున్న ఇల్లెందు మండలం ఆజాద్‌నగర్‌కు చెందిన సపావత్ వెంకన్న, కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కోరంపల్లి గ్రామానికి చెందిన మూడు శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకోగా, మరో ముగ్గురు కవటం, సంజూ, రాజుకుమార్‌లు పరారయ్యారు. ఒడిశా నుంచి భద్రాచలం, ఇల్లెందు మీదుగా జహీరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. సుమారు రూ. 55 లక్షల విలువైన గంజాయి, ఆటో, బైక్, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విచారణ జరపాలి

ఇల్లెందురూరల్: హైదరాబాద్‌లో వృద్ధులు కనకయ్య, రాజమ్మ హత్య ఘటనపై విచారణ నిర్వహించాలని మాణిక్యారం మాజీ సర్పంచ్ మోకాళ్ళ కృష్ణ, న్యూడెమోక్రసీ నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, పొడుగు నర్సింహారావు డిమాండ్ చేశారు. వృద్ధుల భౌతికకాయాలను సోమవారం స్వగ్రామమైన మాణిక్యారానికి తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన న్యూడెమోక్రసీ నాయకులు మాట్లాడారు.

ఇద్దరు నకిలీ మావోయిస్టులు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చంద్రభాను

గుండాల: మూడు నెలల నుంచి మావోయిస్టు పార్టీ పేరుతో వ్యాపారులను బెదిరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం గుండాల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. గుండాల ఎస్సై సైదా రవూఫ్ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా తూరుబాక వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకున్నారు. విచారించగా గుండాల మండలం గణాపురం గ్రామానికి చెందిన కల్తిపాపయ్య అలియాస్ సర్పంచ్, ఆళ్లపల్లి మండలం నడిమిగూడెం గ్రామానికి చెందిన పాయం రాజేందర్‌గా తేలింది. వీరు గతంలో ప్రజాప్రతిఘటన దళంలో పని చేశారు. జల్సాలకు అలవాటు పడి డబ్బు కోసం మావోయిస్టు పార్టీ పేరుతో మూడు నెలలుగా గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో వ్యాపారులను ఫండ్ కావాలని బెదిరింపులకు పాల్పడుతున్నారు. వారిపై నిఘా ఉంచగా తప్పించుకుని తిరుగుతున్నారు. సోమవారం పట్టుబడగా, వారి నుంచి రూ. 5వేలు, రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్, ఎస్సై సైదా రహూఫ్, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లులను ఆయన అభినందించారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అశ్వారావుపేట: అంతర్రాష్ట్ర దొంగను సోమవారం అశ్వారావుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ కథనం ప్రకారం... అశ్వారావుపేట ఎస్‌ఐ అఖిల భద్రాచలం రోడ్‌లో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ ముత్యాల గణేష్ దొంగిలించిన బైక్‌తో పరారవుతుండగా పోలీసులు గమనించి పట్టుకున్నారు. విచారించగా గతంలో 10 బైక్‌లను చోరీ చేసినట్లు తేలింది. అశ్వారావుపేటలో 3, దమ్మపేటలో 1, ఏపీలోని తడికలపూడిలో 6 బైక్‌లు అపహరించినట్లు తెలిపాడు. పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. సమావేశంలో సీఐ నాగరాజు, ఎస్‌ఐ యయాతి రాజు, ఎస్‌ఐ అఖిల, సిబ్బంది నాగేంద్రరావు, వెంకటేశ్వరావు, సిబ్బంది ఉన్నారు.

విలువైన సొత్తు.. చోరీకి అదును

- ఖమ్మం కేబుల్ బ్రిడ్జి సామగ్రిపై దొంగల కన్ను
- ఇటీవల అడ్డొచ్చిన సెక్యూరిటీ గార్డుపై దాడి


దొంగల దాడిలో గాయపడిన అశుతోష్


చోరీ జరిగిన బ్రిడ్జి నిర్మాణ ప్రాంతం

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని కాల్వొడ్డులో మున్నేటిపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇందుకోసం నిర్మాణ సంస్థ సమకూర్చుకున్న సామగ్రిపై దొంగల కన్ను పడింది. ఈ ప్రాంతంలో విలువైన సామగ్రి తరచుగా చోరీ అవుతుండడంతో నిర్మాణ సంస్థ ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బందికి తలనొప్పిగా మారింది. వర్షాలు వస్తే మున్నేటిలో వరద పెరిగి నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడుతుందనే భావనతో ఇటీవల భారీగా సామగ్రిని సమకూర్చుకుని పనుల్లో వేగం పెంచారు. ఈ ప్రాంతంలో పలువురు సెక్యూరిటీ గార్డులను నియమించినా, వారి కళ్లుగప్పుతున్న కొందరు చోరీ చేస్తున్నారు. అయితే, ఇక్కడ సామగ్రి చోరీపై ఖమ్మం త్రీటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు సైతం చేశారు. దీంతో అనుమానితులను పట్టుకుని విచారించగా సమీప ప్రాంతానికి చెందిన అకతాయిలుగా గుర్తించినట్లు సమాచారం. అయితే, కేసు నమోదు చేయకుండా వారి తరఫున కొందరు ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెస్తుండడంతో చోరీలు సర్వసాధారణమయ్యాయి.

సెక్యూరిటీ గార్డ్‌పై కత్తులతో దాడి...

ఇదిలా ఉండగా గతవారం చోరీ వచ్చిన కొందరు వ్యక్తులు అక్కడ విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డుపై కత్తులతో దాడి చేశారు. నిర్మాణ ప్రాంతం నుంచి విలువైన సామగ్రిని ఎత్తుకెళ్తుండగా బిహార్‌కు చెందిన సెక్యూరిటీ గార్డు అశుతోష్‌కుమార్ రాయ్ అడ్డుకున్నాడు. దీంతో ఆయనపై కత్తులతో దాడి చేసిన వారు, తమ వెంట పడకుండా తొడపై తీవ్రగాయం చేసారు. ఈ సమయాన అశుతోష్ కేకలు వేయగా మిగతా సిబ్బంది వచ్చే సరికి పారిపోయారు. దీంతో క్షతగాత్రుడిని సూపర్‌వైజర్ కోటి జిల్లా ఆస్పత్రిలో చేర్పించడమే కాక త్రీటౌన్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఓపక్క వర్షాలు వచ్చేలోగా ఎక్కువ శాతం పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో నిర్మాణ సంస్థ ప్రతినిధులు ఉండగా.. వరుస చోరీలతో ఎటూ పాలుపోలేని పరిస్థితి ఎదురవుతోందని వాపోతున్నారు.

తగ్గిన కిన్నెరసాని నీటిమట్టం


కిన్నెరసాని జలాశయం

పాల్వంచరూరల్ : కిన్నెరసాని జలాశయంలో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లో గతేడాది ఇదే రోజున 396.80 అడుగుల నీటి మట్టం ఉండగా ఈ ఏడాది 396.60 అడుగులు మాత్రమే ఉంది. గతేడాది కంటే రెండడుగుల నీటిమట్టం తగ్గిందని ప్రాజెక్టు ఇంజనీర్ తెలిపారు. వేసవి నీటిమట్టం స్వల్పంగానే తగ్గినందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ జలాశయం ద్వారా నిత్యం 100 క్యూసెక్కుల నీటిని కేటీపీఎస్, నవభారత్ పరిశ్రమలకు సరఫరా చేస్తారు.

ఓసీ–4లో కార్మికుడికి గాయాలు

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ–4లో పనులు నిర్వహిస్తున్న క్రమంలో జారిపడి ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డ ఘటన సోమవారం జరిగింది. వివరాలు ఇలా.. ఫిట్టర్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యానాయుడు ల్యాడర్‌పై వెల్డింగ్ పనులు జరుగుతున్న క్రమంలో స్టాండ్ ఒక్కసారిగా వైపునకు ఒరిగిపోయింది. దీంతో 12 అడుగుల ఎత్తు పైనుంచి జారిపడ్డాడు. దీంతో కార్మికుడి తలకు, ఛాతీ పక్కటెముకకు, మెడ కింద భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స అందించి మెరుగైన వైద్యసేవలకు కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పిడుగుపాటుతో మూడు పశువులు మృతి


మృతి చెందిన పశువులను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి లిఖిత తదితరులు

దుమ్ముగూడెం : మండలంలోని మారాయిగూడెం పంచాయతీ పరిధి జిన్నెగట్టు గ్రామానికి చెందిన అపకా రామారావుకు చెందిన మూడు పశువులు ఆదివారం పిడుగుపాటుతో మృతి చెందాయి. పశు వైద్యాధికారి లిఖిత పోస్టుమార్టం నిర్వహించారు. కాగా తనకు పరిహారం చెల్లించాలని బాధితుడు ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ఇల్లెందురూరల్: మండలంలోని రేపల్లెవాడ గ్రామపంచాయతీ కట్టుగూడెం గ్రామం శివారు పురాతన పెంకు పరిశ్రమలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం తెల్లవారుజామున పోలీసులు దాడి చేశారు. ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. రూ.46వేల నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు, కారు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాగా స్థావరం నిర్వాహకుడు పరారయ్యాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

మహిళపై కేసు నమోదు

కూసుమంచి: ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.3.29 లక్షలు కాజేసిన మహిళపై సోమవారం కూసుమంచి పోలీసులు కేసు నమోదు చేశారు. కూసుమంచికి చెందిన దామళ్ల రామచంద్రయ్యను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రొంపేడుకు చెందిన గుడిబండ్ల ఆదిలక్ష్మి పరిచయం చేసుకుంది. రామచంద్రయ్య కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఆయన నుంచి విడతల వారీగా రూ.3.29లక్షలు తీసుకుని ముఖం చాటేసింది. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఆయన చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

వైటీపీఎస్ డీఈ మృతికి సంతాపం

మృతుడి అవయవాలను దానం చేసిన కుటుంబీకులు

పాల్వంచ: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ డీఈ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పాల్వంచలో సోమవారం అంత్యక్రియలు పూర్తిచేశారు. కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో సుదీర్ఘకాలం విధులు నిర్వహించిన డీఈ ధరావత్ రమేష్ (47) రెండు నెలల క్రితం వైటీపీఎస్‌కు బదిలీపై వెళ్లాడు. వారం రోజుల క్రితం బైక్‌పై ఖమ్మం నుంచి మిర్యాలగూడ వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డాడు. దీంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అతని అవయవాలను కుటుంబ సభ్యులు జీవన్‌దాన్ ట్రస్ట్‌కు అందించారు. మృతదేహాన్ని సోమవారం పాల్వంచలోని కేటీపీఎస్ క్వార్టర్ (నివాసం)కు తీసుకొచ్చారు. పలువురు అధికారులు, ఉద్యోగులు సందర్శించి నివాళులర్పించారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.